# పునర్నిర్మాణ యుగం ప్రారంభమైంది

# ప్రజల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**తెదేపా నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు**



నందిగామ, జులై 02 (మనం న్యూస్) సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు. బుధవారం నందిగామలో పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడమే కూటమి లక్ష్యమని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడపగడపకూ చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని చాటిచెప్పాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలుమెచ్చిన పాలన అందించామని గణాంకాలతో అందించాలని వివరించారు. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే, ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయానికి ప్రాధాన్యత వివరించాలన్నారు. పట్టణప్రాంతాల్లో చెత్తపన్ను రద్దు చేయడం, పేదల కోసం అన్నక్యాంటీన్లను ప్రారంభిం చడం, నెలవారీ పింఛన్ను రూ.నాలుగు వేలకు పెంచడం, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే జీవో 117 రద్దు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మెగా డీఎస్సీ, ఒంటరి మహిళలకు పింఛన్లు, డ్వాక్రా సంఘాల్లో రుణ వితరణలో ప్రాధాన్యత వంటి అంశాలతో పాటు ఉచితగ్యాస్ పథకమే కాకుండా కొద్దిరోజుల వ్యవధిలోనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు అండగా నిలవడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు అడుగులు వేస్తున్నామని దేవినేని ఉమా చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మండవ కృష్ణకుమారి డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, మండల,గ్రామ, పట్టణ,వార్డు తెదేపా నేతలు కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

## విజయవాడలో ఉమ్మడి కృష్ణా జిల్లా వైసీపీ ముఖ్య నేతల సమావేశం

**సమావేశానికి హాజరైన కృష్ణా ,ఎన్టీఆర్ జిల్లాల అధ్యక్షులు**

విజయవాడ సెంట్రల్, జూలై 02 (మనం న్యూస్) విజయవాడలోని వైఎస్సార్ సిపి కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ముఖ్య నేతల సమావేశాన్ని బుధవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగి రమేష్ చంద్రబాబు అబద్ధాల మాటలతో గద్దెను ఎక్కారని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రాల స్థాయి వరకూ అందరూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒక సంవత్సర కాలంగా అందరినీ నష్టపెట్టి, బాధ పెట్టారన్నారు. నాయకులు ఎవరు ఎక్కడికి వెళ్లొద్దు, ప్రజలకు అండగా ఉండండి అంటూ పిలుపునిచ్చారు. మాట ఇస్తే మాట తప్పే కుటుంబం కాదు మాది, ఎవరికి భయపడే ప్రసక్తే లేదని అన్నారు. జమిలి ఎన్నికలు రాబోతున్నాయని, అందరూ కలిసి కట్టుగా ఉండాలని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ విజయాన్ని ఎవరు ఆపలేరని జోస్యం చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత చూపిస్తామంటూ వేదిక పైన నుండి అధికార టిడిపికి హెచ్చరికలు జారీ చేశారు. ఒక్క సంవత్సర కాలంలోనే చంద్రబాబు మోసాలను ప్రజలు చూశారని అన్నారు. జగన్ ఉంటే బటన్ ఎప్పుడు నొక్కుతారా అని ఎదురు చూసేవారని అన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. చేయూత లేదు, ఫీజు రీయింబర్స్ మెంట్ లేదు, రైతు భరోసా లేదు, విద్య దీవెన లేదంటూ కూటమి ప్రభుత్వం పైన విమర్శ గుప్పించారు. చంద్రబాబు చేసిన మొసలను ప్రజల్లోకి తీసుకువెళ్దామంటూ వైసిపి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2019 అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశామన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబునీ ఎవరు నమ్మరనే ఉద్దేశంతో ప్రజలకు బాండ్ పేపర్లు ఇచ్చి మరి నమ్మించారని అన్నారు. చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 4 నుండి 11 వరకూ చంద్రబాబు మోసాలపై కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి పట్టణంలో కార్యక్రమాలు చేపట్టాలని జగన్ సూచించారని తెలిపారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు.





## విజయవాడలో ఎగ్జిబిషన్ పున: ప్రారంభించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కృషి

**దసరాకు ఏర్పాటు చేయాలని నిర్ణయం**

విజయవాడ సెంట్రల్, జూలై 02 (మనం న్యూస్) గతంలో విజయవాడలో అత్యంత ఆదరణ పొందిన కృష్ణ ఇండస్ట్రీయల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎగ్జిబిషన్ తిరిగి ప్రారంభించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కృష్ణ ఇండస్ట్రీయల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ కి చెందిన

పాత సొసైటీ సభ్యులతో ఎంపీ కేశినేని శివనాథ్ బుధవారం కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా ను ఆయన కార్యాలయంలో కలిశారు. 2013 వరకు స్వరాజ్ మైదానంలో ప్రతి ఏడాది వేసవి కాలంలో ఎగ్జిబిషన్ నిర్వహించే వారని, గత పదమూడేళ్లుగా ఎగ్జిబిషన్ నగరంలో నిర్వహించటం లేదని కలెక్టర్ లక్ష్మీశా కి తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఎగ్జిబిషన్ సొసైటీ కి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఎగ్జిబిషన్ ను దసరాకు ప్రారంభించటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ప్రవైట్ స్థలాన్ని లీజ్ కు తీసుకుని అందులో ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కృష్ణా ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ ఫెస్టివల్ పేరుతో దసరా నుంచి ఎగ్జిబిషన్ ను ప్రారంభించే విధంగా కలెక్టర్ లక్ష్మీశా సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.



## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

చందర్లపాడు,జూలై 2. మనం న్యూస్: మండలంలోని కోనాయపాలెం జిల్లా పరిషత్తు పాఠశాల లో బుధవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివియల్ నారాయణ అధ్యక్షతన శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ,ఉపాధ్యాయులు యొక్క కృషిని, విద్యార్థుల పట్ల వారికీ వున్నా ప్రేమ ఆప్యాయత ను, అభివృద్ధిలో వారి యొక్క కృషి కి కృతజ్ఞతలు తెలుపుతూ , బదిలి పై వెళ్లినటువంటి ఉపాధ్యాయులు స్ఫూర్తిని ఐక్యతను కనపర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మార్క పూడి జాన్ కోటయ్య ఉపాధ్యాయుల గురించి మాట్లాడటం జరిగింది.బదిలీపై వెళ్లినటువంటి ఉపాధ్యాయులు సిహెచ్ జయ శ్రీ , ఎం శ్రీనివాస్ జి త్నకుమారి , బి నాగేశ్వరావు లకు ప్రధానోపాధ్యాయులు, మరియు ఉపాధ్యాయులు,పేరెంట్స్ కమిటీ చైర్మన్ ,విద్యార్థులందరూ సభాముఖంగా వీడ్కోలు పలికారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో వైద్యులకు సత్కారం

జగ్గయ్యపేట జులై 2 మనం న్యూస్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడ గలిగే మహనీయులు వైద్యులు మాత్రమే అని లయన్స్ అధ్యక్షులు శ్రీరామ్ బదరీ నారాయణ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో డాక్టర్స్ డే ను పురస్కరించుకొని డాక్టర్ షైలా, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజా కేశవ ప్రసాదులను ఘనంగా సత్కరించారు. లైన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కాసిం సైదా మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అని మాటను నిజం చేసేలా వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు మోహన్ బాబు , ఎస్ వి వి సత్యనారాయణ, కరుణాకర్, రవికుమార్, అమర్నాథ్ ,శ్రీనివాసరావు ,పుల్లారెడ్డి ,నాయుడు ,యోగ లీలావతి తదితరులు పాల్గొన్నారు.



